# స్వంతలాభం కొంత మానుకుం

ఉదయం పదిగంట లయింది.

ఎండలో చెమటలు కక్కుతూ వచ్చిన ప్రభాకరరావుకి ఇంటర్వ్యూ రూముముందు వరండాలో కూర్చున్న, నిల్చున్న మనుష్యులని చూడగానే మరింత చెమటలు పట్టాయి. గుండె ఒక్కక్షణం లయతప్పింది. ఊపిరి అందనట్లు ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. మనసులో ఉజ్జాయింపుగా లెక్క కట్టాడు. అరవై మంది వుండవచ్చు! కనీసం ఏభైకి తక్కువ వుండరు! ఒక్కపోస్టుకి అరవై మంది అంటే తన ఛాన్సు ఎన్నో వంతన్నమాట! ప్రభాకరం మనసులో ఆశ ఎవరో కుదిపినట్లు ధర్మామీటరులో పాదరసంలా అట్టడుగుకి జారింది.

నీరసంగా వరండామీదికి వచ్చాడు.... ఎక్కడా ఖాళీలేదు. ఉన్న బెంచీలు కుర్చీలు నిండిపోయాయి. గోడవారగా నిలబడి రుమాలుతీసుకుని మొహం తుడుచుకున్నాడు. గాలి ఆడన ట్లనిపించి చేతిలో పేపరుతో విసురు కుంటూ చుట్టూ చూశాడు.

కొంతమంది భయంభయంగా ప్రాణా లుగ్గ బెట్టుకుని కూర్చు న్నారు. 'చూద్దాం, తినబోతూ రుచులెందుకు' అని లేని నిబ్బరం తెచ్చు కున్నట్టు మరికొందరు కనిపిస్తున్నారు. 'నిండా మునిగిన వాడికి చలేమిటి? ఇలాంటివి ఎన్నో అయ్యాయి. అందులో ఇదోటి' అన్న మొండిధైర్యం మరి కొందరిలో స్పష్టంగా కనిస్తోంది. 'మనకి కాకపోతే మరెవరి కొస్తుంది, అన్న ధీమా రికమండేషన్ల మొహాలలో మెదులుతూంది. కొంత మంది గుంపులు గుంపులుగా నిల్చుని మాట్లాడుతున్నారు. ఇంటర్వ్యూలో అడగబోయేవాటని చర్చిస్తున్నారు మరికొందరు. పాత ఇంటర్వ్యూల

ముచ్చట్లు ముచ్చటిస్తున్నారు మరికొందరు. మొత్తానికి అక్కడ అంతా గలభాగా వుంది.

ప్రభాకరానికి ఇదేం క్రొత్త కాకపోయినా మొదటిసారిలా కాళ్ళు వణుకుతున్నాయి. చెమటలు పడుతున్నాయి, చికాగ్గా వుంది. ఒక్కపోస్టుకి ఇంతమంది వుంటే మన కేం వస్తుంది యీ ఉద్యోగం! ఇందులో ఫస్టు క్లాసుల వాళ్ళెందరో, రేంకులవాళ్ళు, గోల్డ్ మెడల్సులవాళ్ళు ఎందరో! ప్చ్! ఏం ఆశ వుండేట్టులేదు. ఆమాట అనుకోగానే ప్రభాకరానికి గొంతులో ఏదో అడ్డుపడింది.. ఇది వరకు పదిసార్లలాగే యీసారీ జరిగితే, మళ్ళీ తన ఉద్యోగనిరీక్షణ పర్వం మొదలవుతుంది! యీసారీ యీ ఉద్యోగం రాకపోతే? తర్వాతసంగతి తల్చుకోడానికే అతనికి భయం వేసింది.

అతని ఉద్యోగం మీద ఎంతమంది ఆశలు, కలలు పేర్చుకున్నారో అతనికి తెల్సు! తన ఉద్యోగంతో ఎన్నెన్ని బరువులు, బాధ్యతలు నెరవేర్చాలో కూడా అతనికి తెల్సు! అతనికి తెలియనిదల్లా ఉద్యోగం సంపాయించడం.

అతను మూడేళ్ళుగా ఎన్ని ఊళ్లు, ఎన్ని ఆఫీసులు తిరిగాడో అతని చెప్పులజత కూడా చెప్తుంది! ఈ ఉద్యోగాలకి, అప్లికేషన్లకి, ఇంటర్వ్యూలకి ఎన్నివందలు తగలెట్టాడో అతనికి గుర్తులేకపోయినా, అతని తండ్రిని నిద్రలో లేపి అడిగినా అణాపైసల్తో సహా చెప్పగలడు!

అతనికి ఆ ఇంటిగురించి తల్చుకోడానికే భయం! ఆ యింట్లో వున్న చిన్నా పెద్దా డజనుమందికి రెండుపూటలా నోట్లోకి వేళ్ళు పోవడానికి ఆ యింట్లో మనుష్యులు పడే తాపత్రయాలు తల్చుకుంటే అతనికి దేన్లోనన్నా పడి చావబుద్ధి వేస్తుంది! ఆ యింట్లో అతనుతప్ప ప్రతివాళ్లూ పదో పరకో సంపాయిస్తున్నారని తల్చుకుంటే అతని తల లజ్జతో వంగి పోతుంది! రిటైరైన ప్రముఖ్యేట్లు చెప్పి ఎలాగో అలాగ బండి యీడ్చడానికి

తాపత్రయ పడే తండ్రి, నడుం వంగినా, అప్పడాలువత్తీ, ఇరుగు పొరుగుకి వడియాలు పెట్టీ ఇన్ని మజ్జిగ నీళ్ళయినా అడిగితెచ్చే మేనత్త, మెట్రిక్ చదువుతో ఎలిమెంటరీస్కూల్ పంతులమ్మ పని చేసే చిన్న చెల్లెలు, ఇంట్లో మిషనుకుట్టే విధవచెల్లెలు... ఇంతమంది ఇన్నివిధాల పడే తాపత్రయాలు అన్నీ కలిసినా రెండుపూటలా కడుపునిండా తిండికి కూడా సరిపోవడం లేదంటే రోజుల మహత్యం అని నిట్టూర్పు విడుస్తాడు.

ఇంటర్వ్యూ ఆరంభమయింది। ప్యూను ఒక్కొక్కరి పేరు పిలుస్తున్నాడు. తడబడే అడుగుల్తో, పాలిపోయిన మొహాలతో ఒక్కొక్కరు లోపలి వెళ్ళి పదినిమిషాలలో పైకి వస్తున్నారు.... వచ్చినవాళ్ళని పైనున్న వారు ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు.

ఇంతలో పోర్టికోలో తళతళలాడుతున్న ఓ ఎంబాసిడర్ కారొచ్చి ఆగింది .... అందులోంచి కళకళలాడుతూ ఓ నవనాగరిక వేషంలో వున్న స్త్రీ దిగి చకచకా మెట్లెక్కి వరండా మీదికి వచ్చింది. గుమ్మం దగ్గర ప్యూను నమస్కారం చేశాడు.

"ఇంటర్వ్యూ ఆరంభమయిందా। మిసెస్ రామకృష్ణా వచ్చారని చెప్పిరా?" ఆమె అథార్టీగా అంది. బంట్రోతు లోపలికివెళ్ళి మరు నిమిషం పైకి వచ్చి ఆవిడని సాదరంగా లోపలికి తీసికెళ్ళాడు.

మరో పదిహేను నిమిషాలకి ఆమె వచ్చింది. ఆమెతో నవ్వుతూ మట్లాడుతూ పైకి వచ్చిన ఆయన ఇంటర్వ్యూ మెంబర్లలో ఒకని లోపలికి వెళ్ళి వచ్చిన వారికి తెల్సు.

ఆమెని కారుదాకా సాగనంపి, కారుతలుపు తెరచి పట్టుకున్నా రాయన మర్యాదగా. ఆమె కారెక్కికూర్చున్నాక తల పైన పెట్టి "ఐతే రేపొకసారి రమ్మంటారా నన్నూ"అనడిగింది ఆమె.

"అబ్బే మీ రెండుకు మళ్ళీ రావడం. నే పంపిస్తాలెండి కాగితాలు...." అన్నాడాయన.

ఆమె కృతజ్ఞతా పూర్వకంగా నవ్వింది, "సారీ, మీకు ట్రబుల్ ఇస్తున్నాను." అంది.

"దట్సాల్ రైట్, గుడ్ ఆఫ్టర్ నూన్" అంటూ నవ్వుతూ నమస్కారం చేశాడాయన. కారు కదలి వెళ్ళి పోయింది.

ఆమె ఎవరో అక్కడున్న వారికి ఎవరికి తెలియదు. ఆమెకూడా వారి లాగే ఉద్యోగానికి వచ్చిందన్న ఊహ అంత మందిలో ఏ ఒక్కరికి రాలేదు .... తరువాత ఇంటర్వ్యూ చకచక సాగిపోయింది. తనని అడిగిన రెండు ప్రశ్నలకి బాగానే సమాధానం చెప్పానని ప్రభాకరం అనుకున్నాడు.

* * *

ఆదివారం ఆరోజు, సాయంత్రం ఐదు గంట లయింది.

రామకృష్ణగారు తమ బంగళాముందు లానులో శ్రీమతితో సహా టీ త్రాగడానికి కూర్చున్నారు. కాస్త దూకంలో ఖరీదయిన రబ్బరు బొమ్మల్లా ముద్దొస్తున్న వారిపిల్ల లిద్దరూ ముద్దుముద్దుగా ఇంగ్లీషులో మాట్లాడుకుంటూ చెంగుచెంగున గెంతుతూ బంతాట ఆడుతున్నారు : వాళ్ళని ఆడించడానికి పెట్టిన ఆయా మట్టి గిట్టి వాళ్ళకి తగలకుండా కాపాడు తోంది. రంగు రంగుల అందమైన పూల మధ్య నల్లటి గండుతుమ్మెదలాంటి తోట మాలి రబ్బరుగొట్టంతో జాగ్రత్తగా మొక్కలకి నీళ్ళు పోస్తున్నాడు. పోర్టికోలో చేతులు కట్టుకుని నిలబడ్డాడు డ్రైవర్. నల్లటి వంటవాడు తెల్లటి బట్టలు ధరించి టీ సరంజామా తెచ్చి వారి మధ్య టేబిల్ మీద పెట్టాడు. రామకృష్ణ గారి శ్రీమతి సుతారంగా టీపాయ్ లోంచి "టి" కప్పులలోకి వంపి భర్త గారికి ఒక కప్పు ఇచ్చి తనొకటి తీసుకుంది.

ఆ బంగళా లాంగ్ షాట్ లో చూసినా, క్లోజప్‌లో చూచినా ఖరీదయిన హిందీ సినిమా సెట్టిగుంలా వుంటుంది! ఆ బంగళాను ఆ బంగళా యజమానుల్ని, వారి పిల్లల్ని చూసిన ఎవరైన "అదృష్టవంతులు" అని అనుకోకుండా వుండలేరు. అసూయపడకుండా వుండేవారూ తక్కువే!

టీ త్రాగి పేపరు తెరిచారు రామకృష్ణారావుగారు. టీ త్రాగుతూనే హఠాత్తుగా గుర్తు వచ్చినట్టు "నిన్న యూనివర్సిటికి వెళ్ళానండి" అంది ఆయన మిసెస్.

పేపరులోంచి తలెత్తి చూశా రాయన ప్రశ్నార్థకంగా.

"నిన్న ఇంటర్వ్యూవుంది .... ఆఫ్‌కోర్స్ జస్ట్ ఫార్మాలిటీకి అనుకోండీ .... "

అప్పటికి ఆ సంభాషణ తుదీ మొదలూ అంతుబట్టక అర్థం కానట్టు చూశా రాయన.

"మరచిపోయారా అప్పుడే, యూనివర్సిటీ కాలేజిలో లెక్చరర్ పోస్టు వుందని అప్లైచేశానని చెప్పానుగదూ! నిన్న వెళ్ళి వచ్చాను. మన రామిరెడ్డిగా రున్నారుగా! 'ఇంటర్వ్యూ ఎందుకండీ, అపాయింట్ మెంట్ పంపేస్తాగా' అన్నాడు."

రామకృష్ణగారు భార్య మొహంలోకి చూస్తూండిపొయ్యారు. కొన్ని క్షణాలు, "ఉద్యోగం చేయాడానికే నిశ్చయించా వన్నమాట" ఆఖరికి అడిగారు.

"అదేమిటీ, మళ్ళీ క్రొత్తగా అడుగు తున్నారు. ఆరోజు చెప్పాగా —ఇంట్లో ఏం తోచడం లేదని, అలా ఓ గంటో రెండుగంటలో వెళ్ళి వస్తే కాలక్షేపానికి కాలక్షేపం, నెలతిరిగే సరికి ఐదువందలు చేతిలో పడతాయి...." నవ్వుతూ అంది ఆమె.

కానీ ఆయన నవ్వలేదు.

"చూడు శశీ, నెలకి నాజీతం ఎంత ?"

"రెండువేల పైన .... ఎందుకు అడుగు తున్నారు ?"

"నీకు డబ్బవసరం నిజంగా వుందంటావా ?"

"పూర్తిగా డబ్బుకోసం కాదనుకోండి, కాలక్షేపంకోసం అన్నాగా...."

"కాలక్షేపంకోసం ఉద్యోగం చెయ్యాలా ! ఇంట్లో వంటపని నౌకర్ల మీద వదిలే బదులు స్వయంగా చేసుకుంటే డబ్బు ఆదాయే కాక తోచక పోవడం అన్న ప్రశ్న వుండదు. అలాగే పిల్లల ట్యూటర్‌కి ఇచ్చే వంద ఆదా చేస్తూ వాళ్ళని కూర్చోపెట్టి చదివించ వచ్చు, ఇంటినిండా చదువు కోడానికి పుస్తకా లున్నాయి. రేడియోగ్రాం వినవచ్చు. హాబీక్రింద గార్డెనింగ్ చేయవచ్చు. సాయంత్రానికి సినిమాలు, షికార్లు వుండనే వున్నాయి. చేయదలిస్తే ఎన్ని పనులుంటాయి! ఇంకా తోచకపోవడమన్న ప్రశ్నేది? నీకోసం ఉద్యోగానికి బయలుదేరాల్సిన అవసరం నాకేం కనబడలేదు...."

"అబ్బ, వండుకో, అంట్లు తోముకో, బట్టలుతుక్కో అంటూ చెప్తారేమిటి? యీ పనులన్నీ ఎవరు చేస్తారు! బోర్...." ఆవిడ కాస్త విసుగ్గా అంది.

"యింటిపని బోర్, వూర్లో ఉద్యోగాలు బోర్ కాదన్నమాట...." మిసెస్ మొహం ఎర్రపడడం మొదలు పెట్టింది.

"చూడు శశీ! నీకు కోపం రావచ్చు కానీ, నీకు హాబీ క్రింద, కాలక్షేపంక్రింద కనిపించే యీ ఉద్యోగం ఎందరికో బ్రతుకుతెరువు అని గుర్తించావా? పాపం, ఎందరెందరు ఉద్యోగాలు లేక బాధపడ్తున్నారో నీకు తెలియదా? అలాంటప్పుడు ఉద్యోగం అవసరం లేని నీలాంటివాళ్ళు

ఉద్యోగాలకి ఎగబడుతూంటే యీ నిరుద్యోగ సమస్య ఎలా తీరుతుందో కాస్త ఆలోచించిచూడు..."

ఆమె మొహం మరికాస్త ఎర్రబడుచుకుంది. కోపంగా చూసింది. "ఎందుకీ ఉపన్యాసాలు! మీ పెళ్లాం ఉద్యోగం చెయ్యడం ఇష్టం లేదని సూటిగా చెప్పకుండా ఈ నీతులెందుకు వల్లించడం? హు, అందుకే మన దేశం యిలా ఏడుస్తోంది. ఆడదాన్ని యింట్లోంచి బయటికి రానీయ కూడదనే మన మగవాళ్ల ప్రవృత్తి మారనంతవరకు మనదేశంగతి ఇంతే!" ఆవేశంగా మాటలు విసిరింది ఆమె. ఆయన ఆవిడ కోపానికి బెదరలేదు. మరింత నిశ్చలంగా చూశారు.

"అవును, నువ్వు ఈ ఉద్యోగం చెయ్యడం నాకిష్టంలేదు. కాని కారణాలు నీ వనుకుంటున్నవికావు! నీ ఆరోపణలు నిజంకాదని నీకు తెల్సు. నీవు చెప్పిన స్టేజీలు మనం దాటి చాల రోజులయింది. ఆడవాళ్లు చదువుకోవడం అన్న విషయం పాతబడి పోయింది. అలాగే ఆడవాళ్లు ఉద్యోగాలు చేయడమూ మామూలు విషయం అయిపోయింది. కనక నీ ఆరోపణ నిజంకాదు. భార్యని పైకివదలడం ఇష్టంలేకకాదు; ఇంట్లో అణిచి పెట్టి వుంచాలన్న ఉద్దేశమూ నాకు లేదు. ఆ సంగతి నీకు తెల్సు! నీ కవ సరంలేని యీ ఉద్యోగం యింకే అత్యవసరమున్న వ్యక్తికేనా లభిస్తే ఎంత సంతోషిస్తాడో అన్న కోణంలో చూసి అంటున్నాను.... ...."

"అవును లెండి. అందరూ మీలాగే ఉంటే యీ నాడు ఇంత మంది ఆడవాళ్లు ఉద్యోగా లెలా చేస్తున్నారు? ఐదువందలు చేదని మీలాంటి వాళ్లు అనుకోవాలిగాని, బుద్ధివున్న వాళ్లెవరూ అనుకోరు" వ్యంగ్యంగా ఎత్తిపొడిచింది.

"డబ్బు నాకు చేదుకాదు. ఆ ఐదువందలలో నీ వింకో అరడజను చీరెలు కొనుక్కోవచ్చు, మరో డజను సినిమాలకి వెళ్ళచ్చు, బ్యాంకిలో

దాచుకోవచ్చు. మరో మేడ కట్టించుకోవచ్చు....కాని నే చెప్పదలచింది ఏమిటంటే నీ ఐదొందల సంపాదన లేక పోయినా మనకు ఏ లోటు రాదు. హాయిగా, సుఖంగా బ్రతకడానికి కావల్సిన సంపాదన నాకుంది. కానీ, ఆ ఐదొందలే జీవనోపాధిగా కలవాళ్లు వేలమంది వుంటారు ... ఆ ఉద్యోగం దొరికితే ఆ ఆధారంతో పెళ్లాం పిల్లల్ని పోషించుకోవాలని ఆరాటపడేవాళ్లు అనేకులుండగా ఏ అవసరంలేని నీకు ఆ ఉద్యోగం కావా లనుకోడం అన్యాయం అని నా ఉద్దేశం! విదేశాలలో మాదిరి స్త్రీ పురుషు లిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నా, అందరికీ పుష్కలంగా ఉద్యోగాలు లభించే అంత సుభిక్షంగా మన దేశం లేదు. మనదేశంలో యీ నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగావుందో నీకు తెలియని సంగతికాదు.... నిజంగా ఆర్థికంగా అవసరమున్న కుటుంబాల్లో స్త్రీలు ఉద్యోగం చేసి సహాయపడ్డంలో అర్థంవుంది.... కానీ నీలా హాబీక్రింద, కాలక్షేపంకోసం ఉద్యోగంలో చేరడం నిజంగా అవసరమున్న వారి నోట దుమ్ముకొట్టడం అనే నా ఉద్దేశం"– తీవ్రంగా అన్నా రాయన.

"యీ నిరుద్యోగ సమస్య అంతా నానించే వచ్చినట్టు మాట్లాడుతున్నారు" ఉక్రోషంగా అంది ఆవిడ.

"నీవేకాదు, నీలాంటివాళ్లు ఇంకా చాలామంది వుంటారు...."

"అంటే స్త్రీ ఉద్యోగం చేయకూడదని, ఆర్థిక స్వాతంత్ర్యం ఆమెకి వుండకూడదని మీ ఉద్దేశ్యమా?. పాపం! మళ్ళీ ఆడ డాక్టర్లు కావాలి. ఆడ లెక్చరర్లుండాలి. నర్సులు కావాలి...."

"నీవు నన్ను సరిగా అర్థంజేసుకోడం లేదు... ఆడవాళ్లు ఉద్యోగం చేయకూడదని నే ననడంలేదే?.... నీలాంటివాళ్లు ఉద్యోగం చేయడం గురించి మాత్రమే మాట్లాడుతున్నాను నేను... యీనాడు ఆడవాళ్ళు అన్ని రకాల చదువులు చదువు తున్నారు. అనేకమంది ఉద్యోగాలు

చేస్తున్నారు. కాని ఆర్థికంగా అవసరమున్న వారికి ఉద్యోగా లెక్కడ దొరుకుతున్నాయి? నీసంగతేచూడు. ఆ ఉద్యోగానికి నీకంటే ఎక్కువ అర్హతలున్నవారు చాల మందే వచ్చి వుండవచ్చు. కాని వాళ్ళందరిని కాదని, ఇంటర్వ్యూకూడా అక్కరలేదని నీకే ఉద్యోగం యిస్తున్నారంటే అర్థంఏమిటి ......"

"తమరి పేరు చూసి నాకు ఉద్యోగం యిస్తున్నారు వ్యంగ్యంగా" అంది ఆమె.

"తప్పకుండా అదేకారణం. రామిరెడ్డిగారు మనకు కావల్సినవాడు కావడం, అతనికొడుక్కు నా క్రిందిఆఫీసరుగా ఉద్యోగం యీయడం కారణాలు కావంటావా? లేకపోతే ఆ ఉద్యోగం నీకు వచ్చేదంటావా....?"

"నాఒకర్తివల్ల దేశంలో అందరికి ఉద్యోగాలు దొరకడం లేదంటారు? నేను ఒకర్తిని మానేస్తే యీ నిరుద్యోగ సమస్య వుండదంటారు....?" కోపంతోపాటు హేళనగా. వ్యంగ్యంగా విసిరింది ఆమె.

"నీవు, నీలాంటివాళ్ళు యీలా ఆలోచించాలని నాకోరిక. నావిజ్ఞప్తి. ఎవరిసంగతో నీకు అవసరంలేదు. నీచేతులోవున్నది నీవు చెయ్యి. అదే లోకాన్ని ఉద్ధరించినఫలం! నీ ఉద్యోగం ఏ ఒక్క నిరుద్యోగికో బ్రతుకు తెరువుచూపిస్తే అదేచాలు.... ఏఒక్క నిరుద్యోగికి ఉద్యోగం దొరికినా నిరుద్యోగుల సంఖ్య ఒకటి తగ్గినా తగ్గడమేగా.... నీలాభం కాస్తమాను కుని పొరుగువారికి యీ మాత్రం తోడ్పడితే నీ కొచ్చే నష్టం ఏమీలేదు...."

"హు! సరదాపడి ఉద్యోగం చేస్తానంటే ఎన్ని నీతులు వల్లిస్తున్నారు! ఉద్యోగాలు చేసేవాళ్ళంతా చేస్తూనే వున్నారు. నాఒక్కర్తికే వచ్చింది." మూతి మూడు వంకర్లు తిప్పి విసురుగా లేచి లోపలికి వెళ్ళిపోయిందామె.

రామకృష్ణగారు భార్య వెళ్ళినవైపే చూస్తూ చిన్న నిట్టూర్పు విడిచారు.

భార్య తత్వం తెలిసిన ఆయనకి తను యింతసేపు చెప్పింది ఆమె గాలికి వదిలేస్తుందనీ, చేయదల్చినపని చేస్తుందనీ తెలుసు. తన కంఠశోషే మిగులు, అంతే! అనుకున్నట్టుగానే మూడోరోజు భార్య ఉద్యోగంలో చేరడం ఆయనకి ఏం ఆశ్చర్యం కలిగించలేదు! బాధ అనిపించింది.

*    *    *

వారం రోజుల తర్వాత! సాయంత్రం తోటలో కూర్చుని టీ త్రాగుతూ పేపరు చదువుతున్నారు రామకృష్ణగారు.

తనమాట వినలేదని, నచ్చచెప్పినా అర్థం చేసుకోలేదని కాస్త కష్టం అనిపించి యీవారం నించి భార్యతో కాస్త ముభావంగా వుంటున్నా రాయన. ఆమెకూడా కాస్త దూరంగానే తప్పుకు తిరుగుతూంది.

"నేను .... నేను ఉద్యోగం మానేస్తున్నాను. రేపే రిజైనిస్తున్నా" .... పేపరులో మునిగిన ఆయన, శ్రీమతి ఎప్పుడొచ్చి ఎదురుగా కూర్చుందో చూడనేలేదు! చటుక్కున పేపరులోంచి తలెత్తి ఆశ్చర్యంగా భార్యవైపు చూశారు. ఆమె ఆయన చూపులు తప్పించుకుని కళ్లు వాల్చు కుంది. ఎందుకో ఆమె మొహం కళతప్పింది.

"ఏం ?" కుతూహలంగా అడిగా రాయన. "ఏం లేదు. మానేస్తు న్నాను అంతే ...." పొడిగా ఆ మాట చెప్పి లోపలికి వెళ్ళి పోయింది ఆమె. ఆయన ఆశ్చర్యంగా అలా కొన్ని క్షణాలు చూస్తూ వుండి పోయారు. ఆశ్చర్యంతో పాటు ఆయన ముఖంలో సంతోషం ఆవరించుకుంది.

"పోనీ, కాస్త ఆలస్యంగానైనా తన మాట వింది! తన ఉద్దేశం అర్థం చేసుకుందన్న మాట! అంతే చాలు! తను యీ వారంనుంచి మాట్లాడ్డం లేదనికోపం వచ్చిందని అర్థం చేసుకుని మానేస్తూంది గాబోలు! లేక వారం రోజులకే ఉద్యోగం మొహంమొత్తిందా ? ఏర్ కండిషన్

గదిలో పడుకోడం అలవాటయి గంట రెండు గంటలయినా నించుని పాఠం చెప్పడం కష్టం అనిపించింది గాబోలు! అవును సుకుమారి! ఉద్యోగం సరదా ఓ వారం రోజులు కాకుండానే తీరిపోయింది గాబోలు! పోనీ ఏ కారణం అయితేనేం గాక ఉద్యోగం మానేస్తూంది. ఆ ఉద్యోగం యింకో నిరుద్యోగికి దొరుకుతుంది! ఆనందిస్తాడు." ఆయన సంతృప్తిగా మళ్ళీ పేపరులోకి తలదూర్చారు.

పేపరులో ఓ వార్త మీద ఆయన దృష్టిపడింది. కుతూహలంగా చదువు తున్న ఆయన కనుబొమలు ముడివడ్డాయి.

—"నిరుద్యోగా యువకుని ఆత్మహత్య....

ఎమ్మేప్యేసయి నిరుద్యోగిగా అనేక యాతనలుపడ్తూ తనజీవితం యింక వెలుగు రేఖ చూడటం కల్ల అని నిరాశచేసుకొని ఆత్మహత్య చేసు కుంటున్నట్టు ఉత్తరం రాసి పెట్టుకుని స్టేషనులోకి వస్తున్న రైలుక్రిందికి దుమికి ఆత్మహత్య చేసుకున్న యువకుని పేరు ప్రభాకరరావు, వయస్సు ఇరవై ఐదు సంవత్సరాలు. ఎన్నో ఉద్యోగాలకి ఎంత గానో ప్రయత్నిం చాడు. ఆఖరిసారిగా వారంరోజుల క్రితం యూనివర్సిటీ కాలేజిలో లెక్చ రరు ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళి ఆ ఉద్యోగమూ రానందున నిరాశకి తట్టుకోలేక యింత దారుణానికి పాల్పడ్డాడు."

ఆ వార్త చదువుతూ ప్రాన్పడిపోయారు రామకృష్ణగారు. భార్య ఉద్యోగం మానేయడానికి కారణం హఠాత్తుగా అర్థం అయింది. ప్చ!.... ఆమె యీ నిర్ణయం కొద్ది రోజుల ముందు చేసివుంటే ?.

ఆ ఉద్యోగం యీ యువకునికే తప్పకుండా వస్తుందన్న నిబ్బరం ఏమిటన్న ప్రశ్న రాలేదు ఆయనకి ఆక్షణాన.

(వసుధ '71)